సాక్షి
ఖమ్మం
గురువారం । 26 । డిసెంబర్ । 2024

ప్రభువు అరుదెంచెను..



క్రిస్మస్ సందర్భంగా ఖమ్మం వైరారోడ్డు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



మధిర : బయ్యారం చర్చిలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మంవన్‌టౌన్ : ఖమ్మంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

జిల్లాలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. గత అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన ప్రార్థనలు బుధవారం మధ్యాహ్నం వరకూ కొనసాగాయి. మత పెద్దలు దైవ సందేశాన్ని అందించగా భక్తులు కేక్‌లు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. యేసు ప్రభువు జన్మ వృత్తాంతాన్ని, ఆయన త్యాగాలను ఫాదర్లు, పాస్టర్లు వివరించారు. పలు చర్చిల్లో భక్తి గీతాలను ఆలపించారు. మధిర మండలం బయ్యారంలోని కేథలిక్ చర్చిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేక్ కట్ చేసి మాట్లాడగా, ఖమ్మం చర్చికాంపౌండ్‌లోని సీఎస్ఐ చర్చిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రార్థనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

9లో

న్యూస్‌రీల్

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈఓకు విరాళం అందజేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడ కృష్ణలంకకు చెందిన చెరుకు జయదీప్ – ప్రీతి దంపతులు బుధవారం రూ.1,00,116 విరాళం అందించారు. ఆలయ ఈఓ కె. జగన్మోహన్‌రావుకు నగదు అందజేయగా జయదీప్ దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి శ్రీవారు, అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ పీడీగా శ్రీనివాసరావు



ఖమ్మం గాంధీచౌక్: జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బి.శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సూర్యాపేట జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావును తొలుత ఖమ్మం జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ నోడల్ అధికారిగా నియమించిన ప్రభుత్వం.. తాజాగా పీడీగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ గృహనిర్మాణాలకు చర్యలు చేపట్టిన క్రమంలో 34 మంది అధికారులను హౌసింగ్ కార్పొరేషన్ పీడీలుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్ ఉత్తర్వులు విడుదల చేశారు.

రామాలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం చేస్తున్న అర్చకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

సర్వే సాగుతోంది!

- ఇందిరమ్మ ఇళ్ల కోసం 3.57 లక్షల దరఖాస్తులు
- ఇప్పటివరకు 2,19,224 ఇళ్లల్లో పూర్తయిన సర్వే
- యాప్‌లో అప్‌లోడ్ అయిన దరఖాస్తులు 2,07,580
- సాంకేతిక సమస్యలతో సర్వే సిబ్బంది సతమతం
- సిగ్నల్ లేక, సర్వర్లు పని చేయక ఇబ్బందులు



నియోజకవర్గాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాలు..

నియోజకవర్గం	దరఖాస్తులు	సర్వే చేసిన ఇళ్లు	అప్‌లోడ్ చేసినవి
ఖమ్మం	70,320	39,988	37,701
పాలేరు	70,918	43,613	40,513
మధిర	69,917	46,010	43,942
వైరా	68,582	44,037	42,082
సత్తుపల్లి	78,132	45,576	43,342

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తవుతుందని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఈ సర్వే పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టనుంది. జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 3,57,869 దరఖాస్తులు వచ్చాయి. వాటి పరిశీలన ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని గడువు పెట్టుకున్నారు. అయితే సర్వే ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 2,07,580 దరఖాస్తులు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. సర్వే సమయంలో కొన్నిసార్లు మొబైల్ యాప్ పనిచేయకపోవడం, దరఖాస్తుదారులు కొందరు అందుబాటులో ఉండకపోవడంతో అధికారులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా సర్వే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు.

3.57 లక్షల దరఖాస్తులు..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల హామీ అమలుకు ప్రక్రియ ప్రారంభించింది. జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 3,57,869 మంది దరఖాస్తు చేసుకున్నారు. 400 చదరపు అడుగుల స్థలం తగ్గకుండా ఇంటి నిర్మాణం ఉండనుంది. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ అవసరాన్ని బట్టి పెంచే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. అర్హుల ఎంపికకు ప్రభుత్వం దరఖాస్తుల పరిశీలన ప్రారంభించింది. సర్వే అనంతరం ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది.

క్షేత్రస్థాయిలో సర్వే..

జిల్లాలో ఈనెల 9 నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన క్షేత్రస్థాయిలో ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లో 586 మంది పంచాయతీ కార్యదర్శులతోపాటు ఇతర శాఖల సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఇక కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో 125 మంది చొప్పున వార్డ్ ఆఫీసర్లు క్షేత్ర స్థాయి సర్వేలో పాల్గొంటున్నారు. 500 దరఖాస్తుల కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలనతోపాటు గృహ నిర్మాణశాఖ రూపొందించిన మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. యాప్‌లో మొత్తం 14 కాలమ్స్‌లో వివరాలను పూరిస్తున్నారు.

యాప్‌తో ఇబ్బంది..

క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టిన సిబ్బందికి మొబైల్ యాప్‌తో కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ యాప్‌లో వివరాల నమోదుతోపాటు ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. తొలుత సొంత ఇల్లా.. అద్దెదా అనే వివరాలు, ఆ తర్వాత ప్రస్తుతం ఉంటున్న ఇంటి ఫొటో, ఖాళీ స్థలం ఉంటే అందుకు సంబంధించిన పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత ఇంటి స్థలం ఎవరి పేరుతో ఉందో ఆ వివరాలను కూడా అక్కడ పొందుపరచాలి. ఇక విద్యుత్ బిల్లు, ఖాళీ స్థలం ఫొటో, అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు యాప్‌లో నమోదు చేయాలి. అయితే ఇవన్నీ పూర్తి చేస్తున్న సమయంలో సాంకేతిక సమస్యలతో మొబైల్ యాప్ పలుమార్లు మొరాయిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య తలెత్తుతుండగా.. పట్టణ ప్రాంతాల్లో చాలాసార్లు సర్వర్ పనిచేయడం లేదు. దీంతో ఒక ఇంటి వద్దనే చాలా సమయం వెచ్చించాల్సి వస్తోంది.

2,19,224 ఇళ్లలో సర్వే పూర్తి..

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ఈనెలాఖరులోగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మొత్తం 3,57,869 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 2,19,224 ఇళ్లలో సర్వే నిర్వహించగా.. 2,07,580 దరఖాస్తులను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఇంకా 1,38,645 ఇళ్లు సర్వే చేయాల్సి ఉంది. ఒకవైపు మొబైల్ యాప్‌తో సమస్యలు ఎదురవుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో సర్వే కోసం వెళ్లిన సమయంలో దరఖాస్తుదారులు అందుబాటులో ఉండటం లేదు. దీంతో కాసేపు వేచి ఉండటమో.. లేకపోతే మరోసారి అక్కడికి వెళ్లడమో చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సర్వే మొత్తం పూర్తి చేసేందుకు వచ్చేనెల మొదటి వారం వరకు సమయం పట్టే అవకాశం ఉంది.

ఈనెలాఖరులోగా పూర్తవుతుంది..

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ఈనెల చివరి నాటికి పూర్తవుతుంది. జిల్లాలో సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన అనుకున్న రీతిలో పూర్తి చేస్తున్నారు. మొబైల్ యాప్‌తో అక్కడక్కడా చిన్న చిన్న ఇబ్బందులు వచ్చినా సర్వే సిబ్బంది వాటిని సరి చేసుకుని అప్‌లోడ్ చేస్తున్నారు. కొన్నిచోట్ల ఆఫ్‌లైన్‌లో వివరాలు సేకరించి.. ఆ తర్వాత ఆన్‌లైన్ పూర్తి చేస్తున్నారు. ఎక్కడైనా ఒకటీ అరా మిగిలితే వచ్చే నెల మొదటివారం లోగా పూర్తవుతాయి.

– బి.శ్రీనివాస్, ఈఈ, గృహనిర్మాణశాఖ, ఖమ్మం

నేడు, రేపు మంత్రి పొంగులేటి పర్యటన



ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురు, శుక్రవారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం నాచారం, 10.30 గంటలకు గెన్నెపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయాలను ప్రారంభిస్తారు. 11 గంటలకు దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 11.30కు అశ్వారావుపేట మండలం కేశప్పగూడెంలో, ఆ తర్వాత ములకలపల్లి మండలం కొత్తూరులో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 3 గంటలకు సత్తుపల్లిలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని, 3.45 గంటలకు పెనుబల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. పెనుబల్లి, కల్లూరు మండలాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారు. 4.30 గంటలకు కల్లూరు మండలం పాయపూర్‌లో, 5 గంటలకు తల్లాడ మండలం అంబేద్కర్ నగర్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు భద్రాద్రి జిల్లా సుజాతనగర్‌లో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తారు. 10 గంటలకు పాల్వంచ మండలం ప్రభాత్ నగర్ వద్ద యానంబైల్–జిన్నగట్ట మధ్య హైలెవెల్ బ్రిడ్జి పనులను ప్రారంభిస్తారు. 11 గంటలకు పాల్వంచ మండలం పాండురంగాపురంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 12 గంటలకు లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలో 6వ బెటాలియన్ ప్రవేశద్వారం నుంచి పరేడ్ గ్రౌండ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఒంటిగంటకు కొత్తగూడెం గణేష్ టెంపుల్ సమీపంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 3.30 గంటలకు ఖమ్మంరూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం వద్ద బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 4 గంటలకు తనగంపాడులో, 4.30 గంటలకు కస్నాతండాలో, 5 గంటలకు కాచిరాజుగూడెంలలో, 5.30 గంటలకు ఆరెకోడుతండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

28, 29 తేదీల్లో భక్త సమ్మేళనం

తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహణ



మంత్రి తుమ్మలకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్: శ్రీ రామకృష్ణ పరమహంస – స్వామి వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో సత్తుపల్లిలో తెలుగు రాష్ట్రాల స్థాయి భక్త సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ సమ్మేళనానికి హైదరాబాద్ శ్రీరామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద స్వామి మహారాజ్, ఇతర రాష్ట్రాల స్వామీజీలు, మాతాజీలు హాజరు కానున్నారు. 28వ తేదీన జరిగే సమ్మేళనానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు తదితరులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం మంత్రులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

28న విద్యార్థి సమ్మేళనం..

విద్యార్థుల్లో ఆధ్యాత్మికత పెంపొందించేందుకు స్వామి వివేకానంద, శ్రీరామకృష్ణ భావజలాన్ని నింపేందుకు ఈ నెల 28న ఉదయం పాఠశాల స్థాయి, మధ్యాహ్నం కళాశాలల స్థాయి విద్యార్థులతో సమ్మేళనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 29న జరిగే సమ్మేళనానికి తెలుగు రాష్ట్రాలకు చెందిన శ్రీరామకృష్ణస్వామి, స్వామి వివేకానంద సేవా సంస్థల నిర్వాహకులు, భక్తులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు చీకటి శ్రీనివాసరావు, గట్టే వాసు, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు నాయుడు వెంకటేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు కోరారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలి

ఖమ్మంసహకారనగర్ : కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షా ఉద్యోగులతో పాటు గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులతో చర్చలు జరిపి తక్షణమే సమ్మె విరమించేలా చర్యలు చేపట్టాలన్నారు. బుధవారం ఖమ్మం వచ్చిన నర్సిరెడ్డిని సీఆర్టీలు, కేజీబీవీ, సమగ్ర శిక్షా ఉద్యోగులు కలిసి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవలి శాసనమండలి సమావేశాల్లో ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ స్కూళ్లలో ప్రవేశపెట్టిన డిటెన్షన్ విధానం, దానికి మూలమైన జాతీయ విద్యా విధానం –2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని, డీఏ, పీఆర్‌సీ, పెండింగ్ బిల్లుల చెల్లింపు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు జీవి నాగమల్లేశ్వరరావు, షమీ, బాణాత్ రాందాస్, ధర్మసోత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు!



జిల్లా పెద్దాస్పత్రిలో సంతాన సాఫల్య కేంద్రం

- ఇప్పటికే ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్
- త్వరలోనే ఏర్పాటుకు కసరత్తు
- పిల్లలు లేని నిరుపేదలకు తీరనున్న కష్టాలు

ఖమ్మం వైద్యవిభాగం: సంతానం కోసం పరితపించే నిరుపేదలకు ఊరట లభించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సంతాన లేమితో బాధపడుతున్న దంపతులు ప్రైవేట్ సంతాన సాఫల్య కేంద్రాలకు వెళితే రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. అంత స్థోమత లేని వారి కోసం జిల్లా కేంద్రంలో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ కేంద్రం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఉన్నతాధికారులు కార్యాచరణ ప్రకటించగా.. నిధులు విడుదల చేసి కేంద్రాన్ని ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు.

ఐదింటికి అనుమతి.. కానీ 30 సెంటర్లు

జిల్లాలో ప్రైవేట్ సంతాన సాఫల్య కేంద్రాలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతర్ చేస్తూ ఇష్టం వచ్చినట్లు కేంద్రాలు వెలుస్తున్నాయి. పిల్లలు లేని తల్లిదండ్రులే లక్ష్యంగా ఫెర్టిలిటీ సెంటర్, టెస్టుట్యూబ్ బేబీ సెంటర్ వంటి పేర్లు పెట్టుకుని దందాకు తెరలేపుతున్నారు. తక్కువ ఖర్చుతోనే సంతాన యోగ్యం కలిగిస్తామని నమ్మబలుకుతూ అమాయక దంపతుల నుంచి రూ.లక్షల్లో దండుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా నిబంధనలు అతిక్రమించి సుమారు 30 వరకు సెంటర్లు నడుస్తున్నట్లు సమాచారం. అయితే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అనుమతి కేవలం ఐదింటికే ఉండడం గమనార్హం. వీటి వలలో పడకుండా ప్రభుత్వ పరంగా కేంద్రాలు అందుబాటులోకి తెచ్చేందుకు ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటుకు ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది.

పెరుగుతున్న సంతానలేమి సమస్య..

వివిధ శాఖల అధ్యయనం ప్రకారం రాష్ట్రంలో 26 శాతం మంది సంతాన లేమి సమస్య ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో కూడా దాదాపుగా అదే పరిస్థితి ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇదే అదునుగా జిల్లాలో అనుమతి లేకుండా అనేక ఫెర్టిలిటీ సెంటర్లు నడుస్తున్నాయి. చాలా సెంటర్లు సిట్టింగ్‌ల పేరుతో ఏళ్లకేళ్లు చికిత్స అందిస్తూ రూ.లక్షల్లో వసూలు చేస్తున్నాయి. సంతానం కలగని దంపతులకు తమ ఆస్పత్రిలో ఐవీఎఫ్, ఐయూఐ సేవల పేరుతో నిర్వాహకులు బురిడీ కొట్టిస్తున్నారు. చాలామంది దంపతులు పిల్లలు పుడతారనే ఆశతో ఆయా సెంటర్లను ఆశ్రయిస్తుండగా.. అర్హత లేకుండా నడిపే కొన్ని సెంటర్లలో పిల్లలు పుట్టకపోగా దంపతులు కొత్త అనారోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

నిరుపేదలకు ప్రయోజనం

పెళ్లి అయి ఏళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టక పోవటంతో కుటుంబ సభ్యుల ఒత్తిడి, పిల్లలు కలగాలనే ఆశతో చాలా మంది దంపతులు ఫెర్టిలిటీ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఆయా సెంటర్లకు వెళ్లిన వారికి నిర్వాహకులు మాయమాటలు చెబుతూ రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. చికిత్స పేరుతో నెలలు తరబడి తిప్పుతూ ఆర్థికంగా నష్టపరుస్తున్నారు. సాధారణంగా సంతాన లేమితో బాధపడే దంపతులకు ఐయూఐ, ఐవీఎఫ్, సరోగసీ విధానంలో పిల్లలు కలిగేలా చేస్తారు. అయితే ఈ చికిత్స ఇప్పటివరకు ప్రైవేట్‌లోనే అందుబాటులో ఉండడంతో పిల్లలు లేని నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారు. కొందరు ఆయా సెంటర్ల ఉచ్చులో పడుతుండగా, మరికొందరు డబ్బు పెట్టలేని స్థితిలో ఆవేదనతో కాలం గడుపుతున్నారు. ఫలితంగా కుటుంబీకులు, బంధువులే కాక సమాజం నుంచి సూటిపోటి మాటలతో మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వపరంగా సంతాన సాఫల్య కేంద్రం అందుబాటులోకి వస్తే పిల్లలు లేని నిరుపేదలకు మేలు జరగనుంది. ఉచితంగా నాణ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా ప్రైవేట్‌కు వెళ్లి నష్టపోవాల్సిన పరిస్థితి ఉండదని చెబుతున్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం



పుట్టమట్టిని తీసుకొస్తున్న ఈఓ, భక్తులు

పాల్వంచరూరల్: దేవాలయ పవిత్రత, భక్తుల సర్వశ్రేయస్సు కోసం మూడు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్రోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు, వేదపండితులు, రుత్వికులు మొదట అమ్మవారి సన్నిధిలో గణపతిపూజ, స్వస్తి పుణ్యావాచనం, పంచగవ్యప్రాసన, దీక్షాకంకణధారణ పూజలు జరిపారు. అనంతరం యాగశాలలో శోడషస్తంభ పూజ, అఖండ దీపారాధన, సప్తశోడష మాతృక పూజ, సర్వతో భద్రమండపారాధన పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మంగళ వాయిద్యాలతో అర్చకులు, భక్తులు పుట్టవద్దకు వెళ్లి మృత్తికా సంగ్రహణం చేసి యాగశాలకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

యేసు ప్రతిమతో ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: క్రిస్మస్ సందర్భంగా సువార్త క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం నగరంలో యేసుక్రీస్తు ప్రతిమతో ఊరేగింపు నిర్వహించారు. నగరంలోని ముస్తాఫానగర్ సెయింట్ మేరీ స్కూల్ నుంచి పల్లకీలో ప్రారంభమై పురవీధుల గుండా సాగింది. క్రైస్తవులు కీర్తనలు ఆలపించగా.. మతాలకు అతీతంగా ఊరేగింపు సాగింది.

మున్నేరు పాత వంతెన కింద రోడ్డు సిద్ధం



వాహనాల రాకపోకలకు సిద్ధం చేసిన రోడ్డు

ఖమ్మంఅర్బన్: నగరంలోని కాల్వొడ్డు వద్ద గల మున్నేరు పాత వంతెన కింద ఉన్న చప్టాపై రాకపోకలు సాగించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం కంకర వేయగా, ఒకటి రెండు రోజుల్లో తారు వేసి రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో దాని పక్కనే రూ.200 కోట్లకు పైగా అంచనాలతో తీగల వంతెన పనులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఒక వైపు ఆ వంతెన నిర్మాణం, మరో వైపు పాత వంతెన మరమ్మతులతో ట్రాఫిక్‌ను కొంతమేర నియంత్రించేందుకు ఈ పనులు చేపట్టామని, తారు వేసిన తర్వాత పూర్తిస్థాయిలో వాహనాల రాకపోకలు అనుమతిస్తామని ఈఈ యుగంధర్ తెలిపారు. తాత్కాలిక పనులు జరిగిన రోడ్డుపై బుధవారం టూ, త్రీ వీలర్ వాహనదారులు రాకపోకలు సాగించారు.

ధాన్యం లారీ బోల్తా

డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

కారేపల్లి : ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటన బుధవారం రాత్రి కారేపల్లి మండలంలో చోటుచేసుకుంది. కామేపల్లి మండలం జోగ్గూడెంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి 320 క్వింటాళ్ల ధాన్యం బస్తాలను లోడ్ చేసుకుని ఖమ్మం వైపు వెళ్తుండగా కారేపల్లి క్రాస్ రోడ్డు సమీపంలోని ఓ పెట్రోల్ బంక్ ఎదురుగా లారీ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా క్లీనర్ స్వల్పంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజారాం ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. గాయపడిన ఇద్దరినీ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రఘునాథపాలెం: పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోటపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గ్రామానికి చెందిన వారితో పాటు బంధువుల ఇంటికి వచ్చిన వారు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో వారి వద్ద నుంచి రూ.22,500 నగదు, 4 బైకులు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నని కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

కోడి పందేలరాయుళ్ల...

ఎర్రుపాలెం: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం సమీపంలోని మామిడితోటలో బుధవారం కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. ఎస్సై పి.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం..తోటలో కొంతకాలంగా పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నలుగురు పట్టుబడగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వీరి వద్ద నుండి రెండు కోడిపుంజులు, రూ.2,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మంగళవారం రాత్రి ఇద్దరి వ్యక్తులపై కత్తితో దాడి చేసిన ఘటనలో బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీకి చెందిన వెంకన్న, వీరబాబులు మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా తమ కారుని ఆపి ఉంచారు. ఆ సమయంలో ఎస్ఆర్ఎన్ కాలనీకి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి కారుకు తీసుకొచ్చి అడ్డుగా పెట్టాడు. ఈక్రమంలో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో శ్రీనివాస్ తన వద్ద ఉన్న కత్తితో వెంకన్న, వీరబాబులపై దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

మన ఐకాన్.. త్రిష!



అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారిణి

- భద్రాద్రి నుంచి భారత జట్టు వరకు పయనం
- ఏషియా కప్‌లో ప్రతిభ.. ప్రపంచ్ కప్‌కు ఎంపిక



శిక్షణలో రాటుదేలి..

సికింద్రాబాద్‌లో ఇప్పించిన ప్రత్యేక శిక్షణలో రాటుదేలిన త్రిష 12 ఏళ్ల వయసులోనే అండర్ – 19 హైదరాబాద్ జట్టుకు ఎంపికైంది. అక్కడి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ అండర్ –19 ఇండియా జట్టుకు ఎంపికై దక్షిణాఫ్రికాలో జరిగిన టోర్నమెంట్‌లో పాల్గొంది. ఆ టోర్నీలో భారత్ విజేతగా నిలిచింది. బ్యాటింగ్‌తో పాటు లెగ్ స్పిన్నర్‌గా టోర్నీ గెలుపులో త్రిష తనవంతు పాత్రను సమర్థంగా పోషించింది. అప్పటి నుంచి ఈ రోజు వరకు భారత ఏ జట్టులో ఆడుతూ సీనియర్ జట్టులో చోటు కోసం శ్రమిస్తోంది.

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వచ్చే ఏడాది జనవరి 15 నుంచి ఫిబ్రవరి 2 వరకు మలేషియాలో జరగబోయే ఇంటర్నేషనల్ ఉమెన్ అండర్ – 19, టీ 20 వరల్డ్ కప్ పోటీలకు జిల్లాకు చెందిన గొంగడి త్రిష ఎంపికైంది. 2022లో దక్షిణాఫ్రికాలో జరిగిన టోర్నీలోనూ ఆమె తనదైన ప్రతిభ చాటింది.

భద్రాచలం టు సికింద్రాబాద్..

భద్రాచలానికి చెందిన గొంగడి రామిరెడ్డి ఫిట్‌నెస్ ట్రైనర్‌గా ఐటీసీలో పని చేస్తూనే పట్టణంలో సొంతంగా రామ్స్ జిమ్ నిర్వహించేవారు. అంతర్జాతీయ స్థాయిలో క్రికెటర్‌గా రాణించాలనే ఆయన కల నెరవేరలేదు. అయితే ఆ లోటు తీర్చేందుకు అన్నట్టుగా కూతురు త్రిష చిన్నతనం నుంచే క్రికెట్‌పై ఆసక్తి చూపించింది. దీంతో క్రికెట్‌ను కెరీర్‌గా మలచాలని భావించిన రామిరెడ్డి ఉత్తమ శిక్షణ కోసం సికింద్రాబాద్‌కు మకాం మార్చాలని నిర్ణయించుకున్నారు. అలా త్రిషకు ఏడేళ్ల వయసు ఉన్నప్పుడే ఐటీసీలో ఫిట్‌నెస్ ట్రైనర్ ఉద్యోగానికి రాజీనామా చేసి, పట్టణంలో ఉన్న జిమ్ సెంటర్‌ను అమ్మేసి 2013లో రాష్ట్ర రాజధానికి చేరుకున్నారు. అక్కడ సెయింట్ జాన్స్ క్రికెట్ అకాడమీలో కోచింగ్ మొదలైంది.

ఐపీఎల్ లెగ్ బ్రేక్..

భద్రాచలం నుంచి సికింద్రాబాద్ వెళ్లింది మొదలు రెండేళ్ల క్రితం వరకు క్రికెట్‌లో త్రిష ప్రయాణం ఎదురులేకుండా సాగింది. హైదరాబాద్ అండర్ – 19 నుంచి భారత ఏ జట్టు వరకు ప్రయాణం సాఫీగా సాగింది. అయితే క్రికెట్ వరల్డ్‌లో క్రేజీ టోర్నమెంట్‌గా పేరున్న ఉమెన్ ఐపీఎల్ త్రిషకు కలిసి రాలేదు. ఈ టోర్నీ కోసం జరిగిన వేలంలో త్రిషను తీసుకునేందుకు ఐపీఎల్ యాజమాన్యాలు ఆసక్తి చూపించలేదు. దీంతో టోర్నమెంట్ గెలుపులో తాను ఒకరిగా ఉండడం కంటే మెరుగైన ప్రదర్శన చేయడమే మేలనే నిర్ణయానికి వచ్చింది. కఠోర సాధన చేసింది. దాని తాలూకూ ఫలితాలు ఈ డిసెంబర్‌లో జరిగిన అండర్ 19, టీ 20 ఏషియా కప్ టోర్నమెంట్‌లో కనిపించాయి.

ఇండియా జట్టుకు ఆడాలి

అండర్ –19 విభాగంలో మూడేళ్లుగా భారత జట్టుకు ఆడుతున్నా. ఇటీవల భారత ఏ జట్టుకు వైస్ కెప్టెన్‌గా కూడా ఆడాను. ఏషియా కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ రావడం, ఆ కప్ దేశానికి అందించడం సంతోషాన్ని ఇచ్చింది. ఇండియా మహిళల జట్టుకు ఆడాలన్నదే నా లక్ష్యం.

– గొంగడి త్రిష



తండ్రితో త్రిష

ఎన్నికల ప్రచారకర్తగా..

తెలంగాణ ఎన్నికల సంఘం గొంగడి త్రిషను ఐకాన్‌గా గుర్తించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎలక్షన్ ఐకాన్‌గా, ఈ ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు తెలంగాణ ఐకాన్‌గా పని చేసింది. 2023లో తెలంగాణ ఉమెన్ అవార్డును రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వీకరించింది. ఈ విజయ పరంపరను ఇలాగే కొనసాగిస్తూ త్వరలోనే ఇండియన్ ఉమెన్ క్రికెట్‌లో సీనియర్ జట్టుకు ఆడాలని జిల్లా వాసులు ఆకాంక్షిస్తున్నారు.

ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ..

ఈనెల 15న పాకిస్తాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఒత్తిడికి గురైన త్రిష ఓపెనర్‌గా దిగి పరుగులేమీ చేయకుండానే డకౌట్ అయ్యింది. ఆ తర్వాత పసికూన నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో 17 పరుగులతో నాటౌట్‌గా నిలిచి క్రీజులో లయను అందుకుంది. తర్వాత జరిగిన బంగ్లాదేశ్, శ్రీలంక మ్యాచ్‌లలో వరుసగా 58 నాటౌట్, 32 పరుగులతో రాణించింది. చివరగా బంగ్లాదేశ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విలువైన 52 పరుగులు జోడించి, భారత్ గెలుపులో కీలకంగా మారింది. దీంతో ఫైనల్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో పాటు ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డులు తన ఖాతాలో వేసుకుంది.

నేడు సీపీఐ శత వసంత సంబరం

- ఖమ్మంలో రెడ్‌షర్ట్ వలంటీర్ల ప్రదర్శన
- భక్త రామదాసు కళాక్షేత్రంలో సభ
- ఫ్లెక్సీలు, తోరణాలతో ఏర్పాట్లు



నగరంలోని ఓ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఖమ్మంమయూరిసెంటర్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పార్టీ స్థాపించి 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా అంగరంగ వైభవంగా సంబరాలు నిర్వహించేందుకు పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. నగరాన్ని ఫ్లెక్సీలు, అరుణ తోరణాలతో ముస్తాబు చేశారు. గురువారం ఉదయం ఖమ్మంలో సుమారు ఐదు వేల మందితో భారీ ప్రదర్శన నిర్వహించనుండగా, 100 మంది రెడ్‌షర్ట్ వలంటీర్లు ఎర్రజెండాలతో ముందు వరుసలో నడుస్తారు. పాత కలెక్టరేట్ నుంచి ప్రారంభమయ్యే ప్రదర్శనలో డప్పు, కోలాట నృత్యాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

భక్తరామదాసు కళాక్షేత్రంలో సభ..

ప్రదర్శన అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆవిర్భావ సభ నిర్వహిస్తారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, బాగం హేమంతరావు తదితరులు హాజరవుతారు. 99 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీ.. వందో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఉద్యమ చరిత్రను నేటి తరాలకు తెలియజెప్పాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈ ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆవిర్భావ సభ విజయవంతం కోసం పార్టీ నేతలు ఏర్పాట్లు చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సభ విజయతానికి ఇప్పటికే భారీగా ప్రచారం నిర్వహించారు.

ముక్కోటికి ఘనంగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న రామాలయం ఈఓ రమాదేవి, పక్కన అర్చకులు విజయరాఘవన్ తదితరులు

- 31 నుంచి దశావతారాల్లో భద్రాద్రి రామయ్య..
- భద్రాచలం రామలయం ఈఓ రమాదేవి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు ఘనంగా జరుపుతున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం దేవస్థానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఈసారి రూ.1.20 కోట్లతో ముక్కోటి పనులు చేపట్టామని, రూ.18 లక్షలతో లేజర్ షో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ నెల 31 నుంచి జనవరి 20వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ నెల 31 నుంచి జనవరి 8వ తేదీ వరకు శ్రీసీతారామచంద్రస్వామి వారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. వేడుకల్లో రోజూ మిథిలా స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జనవరి 9న తెప్పోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెప్పోత్సవానికి, వైకుంఠ ద్వారదర్శనానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నెల 11 నుంచే భక్తులకు ఆన్‌లైన్ ద్వారా టికెట్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ముక్కోటికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండు లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచుతామన్నారు. ఉత్తర ద్వారంలో స్వామి వారిని దర్శించుకునేందుకు రూ.2 వేల విలువైన టికెట్లు 650, రూ.1000 టికెట్లు 200, రూ.500 టికెట్లు 665, .రూ.250 టికెట్లు 325 అందుబాటులోఉంచినట్లు వివరించారు. రామాలయం సీఆర్వో కార్యాలయంలో నేరుగా టికెట్ కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు అమరవాది విజయ రాఘవన్, ఈఈ రవీందర్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు ఏపూరి బ్రహ్మం మృతి



ఏపూరి బ్రహ్మం (ఫైల్)

ఇల్లెందు: సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఏపూరి బ్రహ్మం (68) అనారోగ్యంతో బుధవారం తెల్లారుజామున మృతి చెందాడు. ఏఐఎస్ఎఫ్ నాయకుడి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన ఏఐవైఎఫ్, రైతు సంఘం నాయకుడిగా, సీపీఐ ఇల్లెందు డివిజన్ కార్యదర్శిగా పని చేశాడు. 2012 వరకు సింగరేణి ఉద్యోగిగా పని చేసి, ఏఐటీయూసీ బలోపేతానికి కృషి చేశాడు. ఇల్లెందు ఏరియాలో అందరూ బాబాయ్ అని పిలుచుకునే బ్రహ్మం తాజాగా సీతారామా ప్రాజెక్ట్ నీటిని ఇల్లెందు ప్రాంతానికి తరలించాలని వామపక్షాలతో ఏర్పాటు చేసిన సీతారామ సాధన పోరాట సంఘంలో కూడా క్రియాశీలకంగా ఉన్నాడు. నెల రోజుల క్రితం అనారోగ్యానికి గురై చికిత్స పొంది, మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. పట్టణంలోని 15వ నంబర్ బస్తీలో స్వగృహంలో మృతి చెందగా, మృతదేహాన్ని స్వస్థలం కామేపల్లి మండలం ఊటుకూరుకు తరలించారు. అక్కడి ఇల్లెందు సీపీఐ కార్యాలయానికి తీసుకెళ్లారు. పార్టీ శ్రేణులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించాయి.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాడె మోసిన కూనంనేని

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఇల్లెందుఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యేలు గుమ్మడి నర్సయ్య, బానోత్ హరిప్రియ, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు మచ్చా వెంకటేశ్వర్లు, సాబీర్‌పాషా, వివిధ పార్టీల నాయకులు రాజ్‌కుమార్, పశ్య పద్మ, మిర్యాల రంగయ్య, కె.సారయ్య, నజీర్ అహ్మద్, బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, కౌన్సిలర్ రవీందర్, శంకర్, మండే వీరహనుమంతరావు, డాక్టర్ సుధాకర్, దిండిగాల రాజేందర్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, నబీ, మధు, తుపాకుల నాగేశ్వరరావు, ముద్రగడ వంశీ, చాందావత్ రమేష్, డానియేల్, పులి సైదులు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. కూనంనేని తదితరులు పాడె మోసి అంతిమ వీడ్కోలు పలికారు.

అచేతన స్థితిలో వృద్ధురాలు

అన్నం ఫౌండేషన్‌కు తరలింపు



వృద్ధురాలిని తరలిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

ఖమ్మంక్రైం: రైలులో అచేతన స్థితిలో, జ్వరంతో బాధపడుతున్న 85 ఏళ్ల వృద్ధురాలిని అన్నం ఫౌండేషన్ అక్కున చేర్చుకుంది. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి డోర్నకల్ నుంచి విజయవాడ వెళ్లే ప్యాసింజర్ రైలులో వృద్ధురాలు జ్వరంతో వణుకుతూ ఒంటి కన్నుతో అచేతన స్థితిలో పడిఉంది. అదే బోగీలో ప్రయాణిస్తున్న గార్ల కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ గుండెపాక సృజన, ఆయన కూతురు పాయల్ హర్షిత, కారేపల్లి డీసీసీ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ గోపతి పద్మావతి గమనించి.. తమ వద్ద ఉన్న శాలువా కప్పి చలి నుంచి కొంత ఉపశమనం కల్పించారు. ఆ తర్వాత ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీనివాసరావుకు సమాచారం అందించగా రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఫౌండేషన్ సభ్యులు జీఆర్పీ ఎస్సై భాస్కరరావు సమక్షంలో వృద్ధురాలిని అన్నం ఫౌండేషన్‌కు తరలించారు. వృద్ధురాలిని విచారించగా తన పేరు శారా అని, తనది విజయవాడ అని చెప్పింది. తన కొడుకు, ఇతరులు తనను దూర ప్రాంతానికి తీసుకెళ్లి.. 'ఇక్కడే ఉండు ఇప్పుడే వస్తాం' అని చెప్పి వెళ్లారని తెలిపింది.

మొరాయించిన పోలీస్ వాహనం



ఎస్ఐ వాహనం మొరాయించడంతో నెడుతున్న భక్తులు

పాల్వంచ: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పర్యటనలో బందోబస్తు నిమిత్తం వచ్చిన పోలీసుల వాహనం మొరాయించింది. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి పలు చర్చిల్లో జరుగుతున్న ఆరాధన మహోత్సవాల్లో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. రాత్రి 12.30గంటల సమయంలో కాంట్రాక్టర్స్ కాలనీ ఎల్‌జీఎం చర్చిని సందర్శించి వెళ్తుండగా.. బందోబస్తుకు వచ్చిన ఎస్ఐ రాఘవయ్య వాహనం సుమో స్టార్ట్ కాలేదు. మొరాయించి అడ్డుగా ఉండిపోయింది. దీంతో వాహనాన్ని పక్కకు పెట్టాక ఎమ్మెల్యే వెళ్లి పోయారు. అనంతరం కొంతదూరం భక్తులు తోయగా సుమో కూడా స్టార్ట్ కావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

కడుపునొప్పి తాళలేక విద్యార్థిని ఆత్మహత్య

కామేపల్లి : కడుపునొప్పి తాళలేక ఓ విద్యార్థిని ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని పండితాపురం గ్రామానికి చెందిన దండగల ఉమ(17) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండగా.. నొప్పి తీవ్రం కావడంతో తట్టుకోలేక ఇంట్లోనే తెలవారుజామున 5 గంటల సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఉమ తండ్రి భద్రయ్య ఇటీవలే అనారోగ్యంతో మరణించాడు. మృతురాలి తల్లి కనకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

తాటిపూడిలో చోరీ

వైరారూరల్: మండలంలోని తాటిపూడి గ్రామంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. నల్లమోతు రామయ్య అనే వ్యక్తి ఇంట్లో రూ. 2 లక్షల నగదు, బంగారు చెవిదిద్దులు అపహరించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రామయ్య వారం రోజుల క్రితం ఖమ్మంలో ఉంటున్న తమ కుమార్తెల ఇంటికి వెళ్లాడు. బుధవారం సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకునేసరికి ఇంటి వెనుక తలుపు గడియ విరగ్గొట్టడాన్ని గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. ఇంట్లో దాచి ఉంచిన రూ. 2 లక్షల నగదు, బంగారు చెవి దిద్దులు చోరీకి గురైనట్లు గుర్తించి వైరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గుండెపోటుతో కంప్యూటర్ ఆపరేటర్ మృతి



ప్రదీప్‌కుమార్ (ఫైల్)

చింతకాని : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ క్లస్టర్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బుద్దా ప్రదీప్‌కుమార్(35) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం స్వల్ప అస్వస్థతకు గురైన ప్రదీప్‌కుమార్‌ను కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్న క్రమంలో గుండెపోటుకు గురయ్యాడు. ఎంపీడీఓ రామయ్య, ఎంపీఓ పర్వీన్ కైసర్, కంప్యూటర్ ఆపరేటర్లు సుమంత్, రాజు, ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ట్రాలీ వాహనం ఢీకొని..

మేకల వ్యాపారి మృతి



నారాయణ(ఫైల్)

బూర్గంపాడు: మోరంపల్లిబంజరలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మేకల వ్యాపారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోరంపల్లిబంజర గ్రామానికి పులి నారాయణ(55) వారపు సంతలలో మేకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో బుధవారం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ ఢీ కొట్టింది. దీంతో నారాయణ తలకు తీవ్రగాయాలుకాగా, భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, ఐదునెలల క్రితమే పెద్ద కుమారుడు శేఖర్ మృతిచెందాడు. ఆ విషాదం నుంచి తేరుకోక ముందే నారాయణ మృతిచెందంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. గ్రామంలో విషాదం అలుముకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

తొమ్మిది ద్విచక్రవాహనాలు స్వాధీనం

అశ్వారావుపేటరూరల్: రెండేళ్లుగా ద్విచక్రవాహనాలను చోరీకి పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర దొంగను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. స్థానిక ఎస్సై టీ యయాతి రాజు, సిబ్బందితో కలిసి భద్రాచలం రోడ్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అశ్వారావుపేట మండల కేంద్రంలోని దండాబత్తుల వారి వీధికి చెందిన సరిపల్లి నరసింహారాజు పోలీసులను గమనించి తన బైక్‌ను వెనక్కి తిప్పి పారిపోయేందుకు యత్నిస్తుండగా వెంబడించి పట్టుకున్నారు. అతనిని విచారించగా ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. రెండేళ్లుగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో 9 ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 12వ డివిజన్ పోలీసు కాలనీ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దుండగులు ద్విచక్రవాహనంపై వెనక నుంచి వచ్చి చోరీ చేశారని స్థానికులు తెలిపారు. కాలనీకి చెందిన లక్ష్మి అనే మహిళ ప్రధాన రోడ్డు నుంచి కాలనీలోకి నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి వచ్చి మెడలో గొలుసు లాక్కోవడంతో కొంతభాగం తెగింది. మిగితా గొలుసును దుండగులు చోరీ చేశారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు.

బీరు సీసాతో యువకుడిపై దాడి

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో మద్యం మత్తులో ఉన్న యువకుల మధ్య బుధవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఓ యువకుడు బీరు సీసా పగులగొట్టి అమర్లపూడి వరుణ్ అనే యువకుడిపై దాడి చేశాడు. దీంతో వరుణ్ పొట్ట, ఛాతి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై నాగుల్ మీరా ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

క్లుప్తంగా...

9 నుంచి వైకుంఠ ద్వార దర్శనం ఉచిత టోకెన్లు

- జనవరి 10, 11, 12 తేదీలకు 1.20 లక్షల సర్వదర్శనం టోకెన్లు
- జనవరి 9న జారీ...

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి తిరుపతి, తిరుమలలో సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లు జారీ చేయనున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. జనవరి 10, 11, 12 తేదీలకు సంబంధించి జనవరి 9న ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లు ఇస్తామని, తదుపరి రోజులకు ఏరోజుకారోజు ముందురోజు టోకెన్లు జారీచేస్తామని ఈవో తెలిపారు. ఇందుకోసం తిరుపతి, తిరుమలలో కౌంటర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలోని 8 కేంద్రాల్లో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 91 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు తమ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందాలని, టోకెన్లు పొందిన భక్తులకు ఈసారి వారి ఫొటో గుర్తింపుతో కూడిన స్లిప్‌లను జారీచేస్తామని తెలిపారు. టోకెన్లు లేని భక్తులకు ఈ 10 రోజుల్లో శ్రీవారి దర్శనం ఉండదని స్పష్టం చేశారు.

టీటీడీకి రూ.1.11 కోట్ల విరాళం అందజేత

తిరుమల: రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఈవో పి.ఎం.ఎస్.ప్రసాద్ బుధవారం టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు ఒక కోటి పదకొండు లక్షల పదకొండు వేల నూట పదకొండు రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరికి అందజేశారు.

పోటెత్తిన యాదగిరిగుట్ట



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. క్రిస్మస్ సెలవు కావడంతో.. జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలి వచ్చారు. వర్షంలోనే బారులు తీరారు. ధర్మ దర్శనానికి 4 గంటలు, వీఐపీ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. శ్రీస్వామి వారిని 45వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు.



వైఎస్సార్ జిల్లా తాటిరెడ్డిపల్లిలో భారీ జనసందోహం మధ్య వైఎస్ జగన్



జగన్‌కు కేక్ తినిపిస్తున్న తల్లి వైఎస్ విజయమ్మ

నీరా'జనం'

అభిమాన నేతను చూసేందుకు తరలి వచ్చిన పల్లె ప్రజానీకం

తాతిరెడ్డిపల్లె రామాలయం విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న వైఎస్ జగన్

- 30 కిలోమీటర్ల ప్రయాణానికి ఏకంగా 6 గంటల సమయం
- కుటుంబ సభ్యులతో కలిసి పులివెందుల సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు
- పెద్దనాన్న, తల్లితో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసిన మాజీ సీఎం

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా పులివెందుల–తాతిరెడ్డిపల్లె మార్గంలోని పల్లెల జనమంతా బుధవారం రోడ్డుపైకి వచ్చేశారు.. జై జగన్ అంటూ నినాదాలు చేశారు.. తమ అభిమాన నాయకుడు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ రహదారిలో వెళ్తున్నారని తెలుసుకుని ఆయా గ్రామాల వద్ద రోడ్డుపై తిష్ట వేశారు.. దారి పొడువునా జననేతకు బ్రహ్మరథం పట్టారు. వారి అభిమానానికి ముగ్ధుడైన వైఎస్ జగన్ సైతం ఏ ఒక్కరినీ నిరాశ పరచకుండా అందరినీ పలకరిస్తూ, సెల్ఫీలు దిగుతూ, అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పులివెందుల సీఎస్ఐ చర్చిలో ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం లింగాల మండలం తాతిరెడ్డిపల్లెలో రామాలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు 11 గంటలకు బయలుదేరారు. అడుగడుగునా అభిమాన జనం పోటెత్తడంతో 30 కిలోమీటర్ల మేర ప్రయాణించేందుకు ఏకంగా ఆరు గంటలు పట్టింది. ప్రతి గ్రామం వద్ద రోడ్డుపైకి వచ్చిన ప్రజలు వైఎస్ జగన్‌ను చూసేందుకు ఎగబడ్డారు. ఆయనతో మాట్లాడటానికి, కరచాలనం చేయడానికి పోటీ పడ్డారు. సాయంత్రం ఐదు గంటలకు ఆలయం వద్దకు వచ్చే సరికి ఆ ప్రాంతం అంతా జనంతో కిక్కిరిసింది. వైఎస్ జగన్‌కు వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. పులివెందుల సీఎస్ఐ చర్చిలో వైఎస్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు చేశారు. పెద్దనాన్న వైఎస్ శివప్రకాష్‌రెడ్డి, తల్లి వైఎస్ విజయమ్మ, పెద్దమ్మ వైఎస్ భారతమ్మతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్ ఆనందరెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతీరెడ్డి, వైఎస్ ప్రమీలమ్మ, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్ జగన్ 2025 కేలండర్‌ను ఆవిష్కరించారు.

అనంతరం ఆయన కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విగ్రహ మూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కాగా, ఈ ఆలయానికి వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.34 లక్షలు మంజూరు చేశారు.

పాలనలోనూ కృత్రిమ మేధస్సు!

- 21 ప్రభుత్వ విభాగాల్లో ఏఐ వినియోగానికి ఉన్న అవకాశాలపై మదింపు
- ఐటీ శాఖ పరిధిలోని 'ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్'కు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర సర్కారు
- అంతర్జాతీయంగా పాలన రంగంలో ఏఐ వినియోగం తీరుపై అధ్యయనం
- ప్రభుత్వ విభాగాల అవసరాలకు సరిపోయే రీతిలో ఏఐ ఆధారిత అప్లికేషన్ల రూపకల్పన
- పాలనలో ఏఐ వినియోగంపై ఉద్యోగులకు అవగాహన, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, ప్రజాసేవల్లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్– ఏఐ)ను మేళవించి ప్రజలకు త్వరితగతిన, సమర్థవంగా సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సమాచార సాంకేతిక (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) రంగంలో వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వ శాఖలు వెనుకంజలో ఉన్నాయనే విమర్శల నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో కృత్రిమ మేధ వినియోగానికి ఉన్న అవకాశాలపై కసరత్తు చేస్తోంది. ప్రయోగాత్మకంగా కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగంతో కూడిన అప్లికేషన్లు (యాప్‌లు) ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ బాధ్యతను ఐటీ శాఖకు అనుబంధంగా ఉన్న 'ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్'కు అప్పగించింది.

21 ప్రభుత్వ శాఖలతో వర్క్‌షాప్

సాంకేతికత వినియోగం ద్వారా పేదరిక నిర్మూలనకు అవసరమైన విధానాల రూపకల్పనలో పేరొందిన 'జేపీఏఎల్'(జమీల్ పావర్టీ యాక్షన్ లాబ్) రాష్ట్ర పాలనలో ఏఐ వినియోగం విషయంలో ప్రభుత్వంతో జట్టుకట్టింది. ఇటీవల 21 ప్రభుత్వ శాఖలకు చెందిన 'ఏఐ నోడల్ ఆఫీసర్ల'తో వర్క్‌షాప్ నిర్వహించింది. ఆయా ప్రభుత్వ విభాగాల పరిధిలోని సంక్లిష్ట అంశాలకు ఏఐ ద్వారా ఏ తరహాలో పరిష్కారాలు సాధ్యమనే కోణంలో లోతుగా మదింపు చేశారు. అంతర్జాతీయంగా పాలన, ప్రజాసేవలో ఏఐ ప్రభావం, వినియోగం, వివిధ దేశాలు, రాష్ట్రాలు ఏఐని వినియోగిస్తున్న తీరుపై ఈ వర్క్‌షాప్‌లో నోడల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా..

వివిధ ప్రభుత్వ శాఖల అవసరాలకు తగిన ఏఐ ఆధారిత యాప్‌లు, ఏ ప్రభుత్వ విభాగానికి ఏ తరహా యాప్‌లు అవసరమనే కోణంలో ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ కసరత్తు చేస్తోంది. ఆయా ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగులకు కూడా ఏఐ పాలనలో ఏఐ వినియోగంపై అవగాహన కల్పించి, నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ శాఖల్లో దశలవారీగా ఏఐ సాంకేతికత వినియోగాన్ని పెంచేలా ఒక రోడ్‌మ్యాప్ రూపొందించే అంశంపై జేపీఏఎల్, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ కలసి పనిచేస్తున్నాయి.

ఇప్పటికే పలు యాప్‌లు అందుబాటులోకి..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ విజయోత్సవాల్లో భాగంగా రైతులు, యువత, మహిళలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 3 ఐటీ, ఏఐ ఆధారిత అప్లికేషన్లను విడుదల చేసింది. మరో అప్లికేషన్‌ను ప్రభుత్వమే వినియోగిస్తోంది.

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, అగ్రికల్చర్ డేటా ఎక్స్ఛేంజ్ సంయుక్తంగా ఒక అప్లికేషన్ రూపొందించాయి. వేగంగా డేటా మార్పిడి, వ్యవసాయ ఆవిష్కరణలను ఈ యాప్ వేగవంతం చేస్తుంది. రైతులు రూ.లక్షలోపు రుణాలను గతంలో మాదిరిగా వారాల తరబడి కాకుండా రెండు రోజుల వ్యవధిలోనే పొందడం సాధ్యమవుతుంది.
- తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో 'దిమిత్ర'పేరిట ఏఐ ఆధారిత యాప్‌ను రూపొందించింది. పిల్లల్లో మాదక ద్రవ్యాల వినియోగాన్ని ప్రాథమిక స్థాయిలోనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పసిగట్టేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. మాదక ద్రవ్య రహిత వాతావరణంలో పిల్లలు పెరిగేలా ఈ యాప్ తోడ్పడుతుంది.
- గ్రామీణ మహిళల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపు కోసం 'సన్మతి'యాప్ రూపొందించారు. ఏఐ వినియోగంపై సాధారణ పౌరుల్లో అవగాహన పెంచడంలోనూ ఈ యాప్ సాయపడుతుంది.
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, పథకం అమలు కోసం రూపొందించిన 'ఇందిరమ్మ యాప్'తో ప్రస్తుతం లబ్ధిదారుల పరిశీలన జరుగుతోంది. భవిష్యత్తులో ఈ యాప్ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమల్లో కీలకంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం

జేపీఏఎల్ సహకారంతో ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో అనేక ప్రతిపాదనలు అందాయి. ఏయే విభాగాల్లో ఏయే అంశాల్లో ఏఐ వినియోగం సాధ్యమవుతుందో పరిశీలిస్తున్నాం. 21 ప్రభుత్వ శాఖల నుంచి ప్రతిపాదనలు అందినా తొలిదశలో ఐదు శాఖలను ఎంపిక చేసి ఏఐ ఆధారిత అప్లికేషన్లు తయారు చేయాలని భావిస్తున్నాం. త్వరలో సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులతో ఈ అంశంపై ప్రత్యేక సమావేశం జరుగుతుంది.

– రమాదేవి లంకా,
డైరెక్టర్, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్



శ్రీవారిసేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల: సుప్రీంకోర్టు న్యాయమూర్తి హృషికేష్ రాయ్ బుధవారం రాత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన్ని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమలలో జనవరి 10 నుంచి 19 వరకు పది రోజుల వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలను పురస్కరించుకుని జనవరి 7 మంగళవారం తిరుమల ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జనవరి 7వ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో 6న సిఫార్సు లేఖలు స్వీకరించరు.

జిల్లా వార్తలు

శబరిమలకు సైకిల్ యాత్ర



సైకిల్‌పై బయలుదేరుతున్న శేషగిరి స్వామి

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణానికి చెందిన బేతిని శేషగిరి స్వామి సత్తుపల్లి నుంచి శబరిమలకు ఐదో సారి బుధవారం సైకిల్ యాత్ర ప్రారంభించారు. స్థానిక శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి ఆలయంలో ఇరుముడి, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించాక పంచలింగ క్షేత్రాల సందర్శనకు సైకిల్‌పై బయలుదేరారు. శ్రీకాళహస్తి, కంచి, అరుణాచలం, చిదంబరం, జంబుకేశ్వరం మీదుగా శబరిమల చేరడానికి 1600 కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. శేషగిరి స్వామి యాత్ర విజయవంతం కావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు దోసపాటి అమరలింగేశ్వరరావు, బొంతు శ్రీనివాసరావు, ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, భీమిశెట్టి శ్రీనివాసరావు, పోలిశెట్టి శివకుమార్, దురిశెటి శ్రీనివాస్ ఆకాంక్షించారు.

సుందర మందారం !

చర్ల మండల కేంద్రంలోని విజయకాలనీలో తోటమళ్ల శ్రీహరి ఇంటి ఆవరణలో నాటిన మందారం చెట్టుకు పూస్తున్న పూలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఆరు నెలల క్రితం భద్రాచలంలోని ఓ నర్సరీలో ఇతర మొక్కలతో పాటు ఈ మందారం మొక్కను కూడా తీసుకొచ్చి నాటగా అది ప్రస్తుతం మూడున్నర అడుగుల మేర ఎత్తు పెరిగి పూలు పూస్తోంది. అయితే మందార పూలకు భిన్నంగా ఈ పూలు కనిపిస్తుండడంతో పలువురు వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు. – చర్ల



మందార చెట్టుకు పూసిన అరుదైన పూలు

అందాల పొదరిల్లు.. పూబెల్లి

- పర్యాటక అభివృద్ధి దిశగా అడుగులు
- కలెక్టర్ స్వీయ పరిశీలన, యంత్రాంగంతో సమీక్ష
- అధికారులు, గ్రామస్తులకు బాధ్యతలు
- నెల రోజుల్లోగా లక్ష్యం చేరాలని నిర్ణయం



పూబెల్లి గ్రామం వ్యూ

ఇల్లెందురూరల్: దట్టమైన అడవిలో రహదారి సౌకర్యం కూడా లేని గ్రామంలో క్రూరమృగాల సంచారాన్ని సైతం అధిగమించి ఆదివాసీలు అక్కడ జీవనం సాగించారు. కాలక్రమంలో కొన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినా అవి వారి జీవన విధానంలో పెద్దగా మార్పులు తేలేకపోయాయి. అలాంటి గ్రామమైన ఇల్లెందు మండలం పూబెల్లిలో స్వాతంత్ర్యం సిద్ధించాక తొలిసారి ప్రస్తుత కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పర్యటించగా అక్కడి ప్రకృతి అందాలను చూసి ముగ్ధుడయ్యారు. ఈ మేరకు గ్రామాన్ని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయాలని సంకల్పించి ప్రణాళిక సైతం ప్రకటించారు.

ఆదివాసీ గిరిజనుల ఆవాసం..

ఇల్లెందుకు ఏడు కి.మీ. దూరంలో ఉండే పూబెల్లిలో పూర్వం నుంచి నూరు శాతం ఆదివాసీలే జీవనం సాగించేవారు. ప్రస్తుతం గ్రామంలో 855 మంది జనాభా ఉండగా అందులో ఆదివాసీలు 845, పది మంది గిరిజనేతరులు ఉన్నారు. వీరంతా 292 ఎకరాల పట్టాభూమి, 569 ఎకరాల పోడు సాగు చేస్తున్నారు. కేవలం రెండు చెరువులు, ఒక కుంట ఆధారంగా వ్యవసాయం కొనసాగుతోంది. గ్రామానికి ప్రకృతి ప్రసాదించిన జలపాతాలు కొంత మేర ఉపకరిస్తున్నాయి. వ్యవసాయానికి తోడు అటవీ ఉత్పత్తుల సేకరణ, అమ్మకంతో ఉపాధి పొందుతున్నారు.



అధికారులు, గ్రామస్తులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ (ఫైల్)

పైలట్ ప్రాజెక్టుగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కోసం పైలట్ ప్రాజెక్టుగా పూబెల్లిని ఎంపిక చేశారు. ఇక్కడ సర్వే ప్రారంభించేందుకు వచ్చిన కలెక్టర్ పాటిల్ గ్రామ పొలిమేరలోని చెరువు, పచ్చని అందాలను చూసి ముగ్ధులయ్యారు. సహజత్వం ఉట్టిపడేలా ఉన్న పూబెల్లిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని, అందుకు గ్రామస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్న చెరువు

గ్రామానికి కలెక్టర్ తొలిసారిగా రావడం.. అభివృద్ధి చేస్తానని మాట ఇవ్వడంతో స్థానికులకు కొత్తగా అనిపించింది. ఆ తర్వాత అంతా మరిచిపోయినా కలెక్టర్ మాత్రం మండలానికి వచ్చిన ప్రతీసారి పూబెల్లి అభివృద్ధి ప్రణాళికను వివరిస్తుండడంతో గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఇదీ భవిష్యత్ ప్రణాళిక

పెట్టని గోడల్లా ఉన్న గుట్టలు.. వాటికి ఆనుకుని పచ్చని చెట్లు.. మధ్యలో ఏర్పడిన చెరువు కేంద్రంగా పూబెల్లి గ్రామాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పాటిల్ ప్రణాళిక సిద్ధం చేశారు. విశాలంగా ఉన్న చెరువు శిఖం భూమిలో పర్యాటకులు విడిది చేసేలా గుడారాల ఏర్పాటు, చెరువులో బోటింగ్, సైక్లింగ్, క్యాంప్‌ఫైర్ ఏర్పాటుతో పాటు రుచికరమైన ఆహారం అమర్చాలని నిర్ణయించారు. రాత్రి వేళ వెలుతురు కోసం సోలార్ ప్లాంట్ లేదా సైలెట్ జనరేటర్‌ను సమకూర్చడం, స్థానికులను గైడ్లుగా నియమించడంపై కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇదంతా నెలలోగా పూర్తి చేసేలా దిశానిర్దేశం చేసిన కలెక్టర్ పనులన్నీ పూర్తయితే గ్రామస్తులకు ఆదాయం సమకూరుతుందని భరోసా కల్పించారు.



తొట్లగుండం జలపాతం ఆధారంగా ఏర్పడిన వాగు

స్వచ్ఛందంగా సహకరిస్తాం



మా గ్రామానికి కలెక్టర్ స్థాయి అధికారి రావడం ఇదే తొలిసారి. ఆయన చెప్పిన మాటలు కొత్తగా అనిపించాయి. కానీ పలుమార్లు స్పష్టమైన ప్రణాళికతో సూచనలు చేయడంతో అభివృద్ధిపై నమ్మకం కలిగింది. కలెక్టర్ సూచనలతో మా శక్తి మేరకు సహకారం అందిస్తాం.

– ఉమారాణి, పూబెల్లి గ్రామవాసి

అభివృద్ధికి బాటలు



రహదారి సౌకర్యాలు మెరుగుపడడంతో ఇప్పుడిప్పుడే మా గ్రామం అభివృద్ధి బాట పడుతోంది. ఇప్పుడు పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దితే మరింత అభివృద్ధికి అవకాశం కలుగుతుంది. ఇప్పటికే మూడుసార్లు వచ్చిన కలెక్టర్ లక్ష్యం దిశగా ప్రణాళిక రూపొందించి సూచనలు చేశారు.

– జోగ శ్రీకాంత్, పూబెల్లి గ్రామస్తుడు

గ్రామస్తుల సహకారంతో ముందుకు..



పూబెల్లిని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఇప్పటికే ఆదేశించారు. దీనికోసం స్వయంగా ప్రణాళిక ప్రకటించి మాకు దిశానిర్దేశం చేశారు. అందుకు అనుగుణంగా మండల పరిషత్, సెర్ప్ అధికారుల పర్యవేక్షణలో, గ్రామస్తుల సహకారంతో ముందుకు వెళ్తున్నాం.

– బాలకృష్ణ, కార్యదర్శి, పూబెల్లి గ్రామపంచాయతీ

ఆశ్రమ పాఠశాలే క్రీడా ప్రాంగణం!

లోపలికి అనుమతి లేక నిరుపయోగంగా పరికరాలు

అశ్వారావుపేటరూరల్: గ్రామీణ ప్రాంత యువతను క్రీడల్లో ప్రోత్సహించేలా గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన క్రీడాప్రాంగణాలు కొందరు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. అశ్వారావుపేట మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన కావడిగుండ్ల గ్రామానికి క్రీడా ప్రాంగణం మంజూరు కాగా అధికారులు స్థానిక ప్రభుత్వ గిరిజన ఉన్నత ఆశ్రమ పాఠశాలనే క్రీడా ప్రాంగణంగా మార్చి చేతులు దులుపుకున్నారు. పాఠశాల ప్రధాన గేటు వద్ద క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డు ఏర్పాటు చేసి ఆవరణలో ఓ మూలన రూ.లక్షల విలువైన క్రీడాపరికరాలను అమర్చారు. అయితే, బయట వ్యక్తులు, యువకులను లోపలికి అనుమతించకపోవడంతో పరికరాలు వృథాగా మారాయి. ఇందులో కొన్నింటిని విద్యార్థుల బట్టలు ఆరేసేందుకు వినియోగిస్తుండడం గమనార్హం. ఈ అంశంపై ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా రెవెన్యూ శాఖ ద్వారా క్రీడా మైదానానికి స్థలం కేటాయించాల్సి ఉండగా గతంలో ఏం జరిగిందో తనకు సమాచారం లేదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వివరాలు సేకరించి క్రీడా స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.



ఆశ్రమ పాఠశాల బోర్డు పక్కనే క్రీడా ప్రాంగణం బోర్డు



క్రీడా పరికరాలపై ఆరేసిన దుస్తులు

జోరుగా వరినాట్లు...



వరి నారు తీస్తున్న కూలీలు

చర్ల: ఏజెన్సీ ప్రాంతంలో రబీ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు ద్వారా రెండో జోన్ పరిధి చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో సాగుకు నీరు విడుదల చేస్తుండగా ఆయకట్టు రైతులతో పాటు బోర్లు, చెరువుల కింద కూడా రైతులు వరినాట్లు వేగవంతం చేశారు. తాలిపేరు ప్రాజెక్టు మరమ్మతుల దృష్ట్యా మార్చి 31 వరకే సాగునీరు విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో రైతులు నవంబర్‌లోనే నారు పోయగా ఇప్పుడు నాట్లు వేస్తున్నారు. ఓ పక్క పత్తి తీసే పనులు కొనసాగుతుండగా, మరోపక్క వరి నాట్లు ప్రారంభం కావడంతో కూలీల కొరత ఏర్పడుతోంది. ఈ మేరకు సరిహద్దు ప్రాంత ఆదివాసీ గ్రామాల నుంచి గిరిజనులను రైతులు తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో దమ్ము చేయడం, వరినార్లు తీయడం, నాటు వేయడం పనులతో వ్యవసాయ క్షేత్రాల్లో సందడి నెలకొంది. మరో వారం, పది రోజుల్లో వరినాట్లు పూర్తి కానుండగా గత ఏడాది రబీతో పోలిస్తే ఈసారి వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



నాట్లు వేస్తూ..